నోట్లు వద్దు.. డిజిటలే ముద్దు!

- నగదు లావాదేవీలపై ఆసక్తి చూపని ప్రజలు
- కిల్లీ కొట్టు నుంచి షాపింగ్ మాళ్ల వరకు అంతా డిజిటల్ చెల్లింపులే
- అన్ని షాపుల్లో క్యూఆర్ కోడ్‌ల దర్శనం
- గ్రామ సచివాలయాల్లోనూ నగదు రహిత చెల్లింపులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు


కిరాణ దుకాణంలో క్యూఆర్‌కోడ్ స్కాన్ ద్వారా బిల్లు చెల్లిస్తున్న వినియోగదారుడు

కోవెలకుంట్ల: 2016వ సంవత్సరం రూ.500. రూ. వెయ్యి నోట్ల రద్దు అనంతరం మారుతున్న కాలానికనుగుణంగా వచ్చిన సాంకేతికను అందిపుచ్చుకుని పల్లెలు, పట్టణాలు డిజిటల్ మనీ దిశగా పరుగులు పెడుతున్నాయి. చిన్న మొత్తం నుంచి పెద్ద మొత్తం వరకు ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారానే లావాదేవీలు కొనసాగుతున్నాయి. వివిధ లావాదేవీల నిర్వహణకు నోట్లను తీసుకెళ్లాల్సిన అవసరం లేకుండా, చిల్లర సమస్య తలెత్తకుండా డిజిటల్ ప్రక్రియ ద్వారా చెల్లింపులు చేస్తున్నారు.

అన్ని చోట్లా డిజిటల్ మనీ..

జిల్లాలోని 29 మండలాల పరిధిలో 21 లక్షల జనాభా ఉండగా దాదాపు 2 లక్షలకు పైగా వ్యాపార సముదాయాలున్నాయి. పట్టణాలు, గ్రామాలు, మారుమూల పల్లెల్లో సైతం ఆన్‌లైన్‌లో నగదు చెల్లింపులు జరుగుతున్నాయి. కిరణాకొట్టు, కిల్లి బంకులు, వస్త్ర దుకాణాలు, మెడికల్ షాపులు, బంగారు షాపులు, పెట్రోల్ బంకులు, రోడ్డు పక్కన చిరు వ్యాపారులు, చివరకు బస్సు, రైళ్లలో ప్రయాణీకులకు సైతం డిజిటల్ మనీ ద్వారా లావాదేవీలు నిర్వహిస్తున్నారు. రోడ్ల వెంట ఉన్న చిన్నపాటి బంకుల్లో కూడా ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం క్యూఆర్ కోడ్‌లు అందుబాటులో ఉండటంతో వాటి ద్వారానే నగదు లావాదేవీలు అధికమయ్యాయి.

చిల్లర సమస్యకు చెక్

ప్రజలు తమ ఆండ్రాయిడ్ యాపిల్ ఫోన్లలో యూపీఐ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని చిటికెలో చెల్లింపులు జరుపుతున్నారు. జిల్లాలోని రోజు రూ. 100 కోట్ల దాకా ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు జరుపుతున్నట్లు అంచనా. గతంలో రూపాయి, రెండు, ఐదు రూపాయల కాయిన్లకు డిమాండ్ ఉండేది. హోటళ్లు, కిరణా దుకాణాల్లో చిల్లర అవసరమున్నా లభ్యత అంతంత మాత్రంగానే ఉండేది. దీంతో వంద రూపాయల చిల్లర కోసం వ్యాపారులు రూ. 10 కమీషన్ ఇచ్చి మరీ తీసుకునేవారు. ప్రస్తుతం చిల్లర అవసరం లేకుండా డిజిటల్ మనీతో చెల్లింపులు చేస్తున్నారు.

అప్రమత్తత లేకపోతే గుల్లే

వివిధ వస్తువుల కొనుగోలుకు ఆన్‌లైన్ చెల్లింపులు ఎంత పెరిగాయో సైబర్ నేగరాళ్లు అంతేస్థాయిలో విజృంభిస్తున్నారు. లింకులను పంపి వీటిని క్లిక్ చేయాలని ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఆన్‌లైన్ చెల్లింపులపై అవగాహన లేని కొందరు ప్రజలు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడుతున్నారు. తెలియకుండా లింకులను క్లిక్ చేసి వారి ఖాతాల్లో నగదును అక్రమార్కులకు అప్పనంగా అప్పగిస్తున్నారు. జిల్లాలో ఎక్కడో ఒక చోట లింకుల ద్వారా నగదు పోగొట్టుకున్నామని పోలీసులను ఆశ్రయిస్తున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇలాంటి సైబర్‌నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



ప్రతి చిన్న లావాదేవీలను ప్రజలు ఆన్‌లైన్ ద్వారా పేమెంట్ చెల్లిస్తున్నారు. సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజలకు లింకులు పెట్టి వారి ఖాతాల్లో నగదును విత్ డ్రా చేస్తున్నారు. డబ్బులకు సంబంధించి ఎలాంటి లింకులను ఓపెన్ చేయకుండా, తెలియని వ్యక్తులు ఓటీపీ అడితే అప్రమత్తంగా ఉండాలి.
– వెంకటరెడ్డి, ఎస్ఐ, కోవెలకుంట్ల

ఫోన్‌పే ద్వారా లావాదేవీలు



గతంలో జేబులో నగదు పెట్టుకుని ఇంట్లోకి కావాల్సిన నిత్యావసర సరుకులు, కూరగాయలు, తదితర అన్ని రకాల వస్తువులు కొనుగోలు చేసేవాడిని. ఫోన్‌పే అందుబాటులోకి వచ్చాక చిల్లర సమస్య తలెత్తకుండా గత కొన్ని సంవత్సరాల నుంచి డిజిటల్ లావాదేవీలు నిర్వహిస్తున్నా.
– నాగయ్య, వినియోగదారుడు, కోవెలకుంట్ల

రోజుకు రూ. లక్ష వరకు ఆన్‌లైన్ చెల్లింపులు



పట్టణంలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ వస్తువులను విక్రయిస్తున్నా. కోవెలకుంట్ల మండలంతో పాటు సంజామల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, గోస్పాడు, తదితర మండలాల నుంచి నిత్యం వివిధ వస్తువుల కొనుగోలు దారులు గూగుల్‌పే, స్వైపింగ్ ద్వారా లావాదేవీలు జరుపుతున్నారు. రోజుకు రూ. 50 వేల నుంచి రూ. లక్ష వరకు ఆన్‌లైన్ ద్వారా పేమెంట్ జరుగుతోంది. డిజిటల్ చెల్లింపులు అందుబాటులోకి రావడంతో దొంగనోట్ల బెడద, చిల్లర సమస్యకు చెక్ పడింది.
– శ్రీనివాసరెడ్డి, పవన్ ఏజెన్సీ అధినేత, కోవెలకుంట్ల

నేడు 'పల్లెకు పోదాం'

కోవెలకుంట్ల: మండలంలోని చిన్నకొప్పెర్ల గ్రామ సచివాలయ పరిధిలో మంగళవారం పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సయ్యదు న్నీసా సోమవారం తెలిపారు. అధికారులు గ్రామాన్ని చేరుకుని ఆయా కుటుంబాలను సందర్శించి ప్రభుత్వ పనితీరు, లబ్ధిదారులకు చేకూరిన లబ్ధిని వివరిస్తారన్నారు.

నేడు అల్వకొండలో ..

సంజామల: మండల పరిధిలోని అల్వకొండ గ్రామంలో వై ఏపీ నీడ్ జగన్ కార్యక్రమం మంగళవారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ గుండం సూర్య ప్రకాష్ రెడ్డి తెలిపారు. వివిధ సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ చేసి ప్రజలకు వివరించే కార్యక్రమం ఉంటుందన్నారు.

ఆంజనేయస్వామికి పూజలు

డోన్ టౌన్ : మండలంలోని గుమ్మకొండ గ్రామ సమీప కొండల్లో వెలసిన శ్రీ బంగారుకొండ పాత పాలెం అభయాంజనేయస్వామికి భక్తు సోమ వారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాస ప్రారంభ అమావాస్య పురస్కరించుకొని అభిషేకాలు, అర్చనలు, సింధూరం, తులసీమాల, తమలపాకుల తోరణాలుతో పాటు మహా మంగళ హారతి తదితర ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం హోమాలు, మెట్ల పూజల ఉంటాయని గ్రామ సర్పంచ్ బొమ్మిరెడ్డి దశరథరామిరెడ్డి తెలిపారు.

బేతంచెర్ల: పట్టణంలోని బైటిపేటలో వెలసిన గాడు బావి వీరాంజనేయస్వామి, గౌరి పేటలో వెలసిన ఆంజనేయ స్వామి, పలక చింత మాను, కనుమ ఆంజనేయస్వామి ఆలయంలో ఆశ్వయుజ మాస అమావాస్య సోమవారం పూజలు ఘనంగా నిర్వహించారు. అలాగే బనగానపల్లె రహదారిలోని పుట్ట పెద్దమ్మ ఆలయంలో, సిమెంట్ నగర్ గ్రామంలో వెలసిన సుంకులా పరమేశ్వరి ఆలయంలో నిర్వాహకులు రామకృష్ణ ఆధ్వర్యంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

క్లుప్తంగా

ఫ్రీజర్ బాక్స్ వితరణ


ఫ్రీజర్ బాక్స్‌ను అందజేస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లెకు చెందిన దూదేకుల సిద్దయ్య రూ.50వేల విలువ గల ఫ్రీజర్ బాక్స్‌ను గ్రామస్తుల కోసం సోమవారం అందజేశారు. జీవిచెట్ల వద్ద ఉన్న ప్రధాన రహదారిలోని మసీదులో ఫ్రీజర్ బాక్స్ ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు ఉపయోగించుకోవచ్చని చెప్పారు.

పౌష్టికాహారం పంపిణీ


ప్రభుత్వాసుపత్రిలో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

డోన్ : స్థానిక ప్రభుత్వాసుపత్రిలో బాలింతలు, గర్భిణులు, వారి సహాయకులకు ప్రతి ఆదివారం పౌష్టికాహార పంపిణీ నిరాటకంగా కొనసాగుతోంది. స్థానిక ప్రార్థన సమయం నిర్వాహకుడు జాన్ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆదివారం ఆసుపత్రిలో రోగులకు రొట్టె, పప్పు, కోడిగుడ్డు పంపిణీ చేశారు. ఇప్పటివరకు 80 ఆదివారాలు పౌష్టికాహారాన్ని పంపిణీ చేసినట్లు నిర్వాహకుడు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రాజేష్, ఫకృద్దీన్ పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు


అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

డోన్ : పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని యువకుడు (35) మృతి చెందగా.. సోమవారం ద్రోణాచలం సేవాసమితి సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. గుర్తు తెలియని అనాథ శవం పడి ఉందన్న సమాచారాన్ని డోన్ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి ద్వారా తెలుసుకున్న సమితి సభ్యులు పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం శ్మశానవాటికలో హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమానికి పారిశ్రామికవేత్త మల్యాల శ్రీనివాసరెడ్డి, రాజయ్యగౌడ్ ఆర్థిక సహాయం అందించారు. అంత్యక్రియల్లో సేవా సమితి సభ్యులు షాదీఖానా రాజు, పాణిపూరి మురళి, పూలమాబు, రసూల్, పట్టణ పోలీసులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో దేశం అస్తవ్యస్తం

డోన్ టౌన్ : దేశంలో బీజేపీ పాలనతో అస్తవ్యస్తంగా తయారైందని సీపీఎం సీనియర్ నాయకుడు కొండన్న అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 15న విజయవాడలో జరుగనున్న ప్రజా రక్షణ భేరి యాత్రను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం పట్టణంలో ప్రచార జాతాను ప్రారంభిచారు. ఈ సందర్భంగా కొండన్న, సీపీఎం మండల, పట్టణ కార్యదర్శులు కొయిలకొండ నాగరాజు, నక్కి శ్రీకాంత్, సీఐటీయూ కార్యదర్శి శివరామ్ మాట్లాడుతూ దేశ భవిష్యత్‌ను సరిదిద్దూ కోవడానికి ప్రజలు ఐకమత్యంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

సమాజ సేవతోనే జీవితానికి సార్థకత

బేతంచెర్ల: సమాజ సేవతోనే జీవితానికి సార్థకత చేకూరుతుందని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. మండలంలోని సిమెంట్ నగర్‌కు చెందిన సమాజ సేవకుడు పోన్నూర్ సాహెబ్ ఆర్థిక సహకారంతో స్టేట్ బ్యాంక్‌కు సోమవారం గోడ గడియారం అందజేశారు. కార్యక్రమంలో వైయస్సార్‌సీపీ నాయకులు బాబురెడ్డి, దస్తగిరి తదితరులు ఉన్నారు.

ఇంట్లో వెలసిన త్రిశూలం?


బండ కింద వెలసిన త్రిశూలం

ప్యాపిలి: మండల పరిధిలోని రాచర్ల గ్రామంలో సోమవారం ఓ ఇంట్లో త్రిశూలం వెలిసినట్లు ఓ వార్త దావానంలా వ్యాపించింది. గ్రామస్తులు తెలిపిన మేరకు వివరాలు.. గ్రామానికి చెందిన పూజారి వేణు అనే వ్యక్తికి గత కొద్ది రోజులుగా కాళికాదేవి అమ్మవారు ఆవహిస్తోంది. సోమవారం పొలానికి వెళ్లిన పూజారి వేణు సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చాడు. ఇంటికి వచ్చిన కొంతసేపటి పూజారి వేణుకు అమ్మవారు ఆవహించింది. ఇంట్లోని ఓ బండను చూపిస్తూ 'ఈ బండ కింద త్రిశూలం ఉందని బండను పగులకొట్టాల్సిందిగా' వేణు స్థానికులకు చెప్పాడు. దీంతో అక్కడున్న వారు బండను తొలగించగా బండ కింద త్రిశూలం కనిపించింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, చుట్టు పక్కన గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకుని త్రిశూలానికి పూజలు చేస్తున్నారు. రాచర్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

యాగంటిలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే పూజలు


ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్: యాగంటి క్షేత్రంలోని శ్రీ ఉమామహేశ్వర స్వామిని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి కుటుంబ సభ్యులతో సోమవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ చైర్మన్ తొటబుచ్చిరెడ్డి, ఈఓ చంద్రశేఖరెడ్డి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ఏకశిలారూపంలో కొలువైన శివ పార్వతులకు అభిషేకం, అర్చన తదితర పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఎమ్మెల్యే దంపతులను పూలమాల, దుశ్శాలువా వేసి ఘనంగా సన్మానించి స్వామి వారి ప్రసాదం అందజేశారు. అనంతరం యాగంటి క్షేత్ర కార్తీకమాసోత్సవ ఆహ్వాన పత్రికలను ఈఓ, చైర్మన్‌లు అందజేసి ఉత్సవాలకు హాజరుకావాలని కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ


చెక్కును అందజేస్తున్న చైర్మన్ రాజేష్

డోన్ : పేద ప్రజల ఆరోగ్య సంరక్షణ విషయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందని మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో కొండపేటకు చెందిన రాజేంద్రప్రసాద్ అనే వ్యక్తికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.45వేల చెక్కును సోమవారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీను, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

డోన్ రూరల్ : మండల పరిధిలోని సీసంగుంతల గ్రామానికి చెందిన ఆలమద్దయ్య అనే వ్యక్తికి గ్రామ సర్పంచ్ సిద్ధయ్య చేతుల మీదుగా రూ.3 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ ఆలమద్దయ్య లారీ డ్రైవర్‌గా పని చేసేవాడని, కొన్ని నెలల క్రితం లారీ మీద నుంచి కింద పడి తలకు తీవ్రగాయాలు కావడంతో హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకున్నాడని వివరించారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభాకర్, వెంకటేశ్వర్లు, కె.మద్దయ్య, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

సాధికార బస్సు యాత్ర ఏర్పాట్ల పరిశీలన


పెట్రోల్‌బంకు సెంటర్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె : వైఎస్సార్‌సీపీ తలపెట్టిన సాధికార బస్సు యాత్ర ఈ నెల 22న బనగానపల్లె పట్టణంలో చేపట్టనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లపై స్థానిక ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సోమవారం సాయంత్రం పట్టణంలోని పెట్రోల్‌బంకు సెంటర్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో ఉపముఖ్య మంత్రులు, మంత్రులు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొంటున్నందున ప్రజలు పెద్ద ఎత్తున్న ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో అవుకు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అంబటి రవి కుమార్ రెడ్డి, శంకర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, మాధవ రెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఇరు వర్గాలపై కేసు నమోదు

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్ల ఎస్సీ కాలనీకి చెందిన ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలు.. ఎస్సీ కాలనీకి చెందిన మందా విజయ్ వృత్తిరీత్యా అనంతపురంలో లాయర్‌గా పని చేస్తూ.. అక్కడే నివాసం ఉంటూ.. అప్పుడప్పుడు కొలిమిగుండ్లకు వస్తుంటాడు. బనగానపల్లె నియోజకవర్గ తెలుగు యువత అధికార ప్రతినిధిగా కూడా వ్యవహరిస్తున్నాడు. అదే కాలనీకి చెందిన నాగేశ్వరరావు ఎమ్మార్పీఎస్ మండల నాయకుడిగా ఉన్నాడు. నాగేశ్వరావు.. విజయ్ ఇంటికి దగ్గర్లో రోడ్డుకు పక్కనే కమ్యూనిటీ హాల్ నిర్మిస్తున్నాడు. ఆ నిర్మాణం అక్రమం అంటూ విజయ్ అధికారులతో పాటు లోకాయుక్తకు ఫిర్యాదు చేశాడు. అంతేకాకుండా ఫేస్‌బుక్ వేదికగా నాగేశ్వరావు అక్రమ నిర్మాణం చేస్తున్నాడని పలు ఆరోపణలతో వీడియోలు చేస్తూ పోస్టులు పెడుతున్నాడు. విజయ్ అనంతపురంలో ఉన్న సమయంలో నాగేశ్వరావు వర్గీయులు ఫోన్‌లో దూషించారు. దీంతో అనంతపురం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆరుగురిపై కేసు పెట్టాడు. ఈ నేపథ్యంలో విజయ్ ఆదివారం స్వగ్రామమైన కొలిమిగుండ్లలోని ఇంట్లో ఉన్న సమయంలో తమపై కేసు ఎందుకు పెట్టావు, ఎందుకు ఇబ్బందులు గురిచేస్తున్నావని నాగేశ్వరావు వర్గానికి చెందిన మహిళలు వెళ్లి ప్రశ్నించచారు. మాటామాట పెరిగి గొడవ చోటు చేసుకుంది. దీంతో విజయ్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో నాగేశ్వరరావుతో పాటు మొత్తం తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. అలాగే టీడీపీ అధికార ప్రతినిధి విజయ్ చాలా కాలం నుంచి లైంగికంగా వేధిస్తున్నాడని, అంతేగాక అనంతపురంలో తమపై కేసు పెట్టాడని, ఈవిషయంపై అడిగేందుకు వెళితే ఎదురు దాడి చేశాడని నాగేశ్వరరావు వర్గానికి చెందిన రమాదేవి ఫిర్యాదు చేయడంతో విజయ్‌పై కూడా కేసు నమోదు చేశామన్నారు. ఇది కేవలం వ్యక్తిగతంగా జరిగిన గొడవేగాని, పార్టీల పరంగా జరగలేదన్నారు.

ఘనంగా దీపావళి


దీపావళి పండుగ జరుపుకుంటున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, కుటుంబ సభ్యులు

బనగానపల్లె/కోవెలకుంట్ల: నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు దీపావళి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. చిన్నాపెద్దా తేడాలేకుండా బాణసంచా కాలుస్తూ ఆనందోత్సాహలకు గడిపారు. బనగానపల్లె పట్టణంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దీపావళి వేడుకలను కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా నిర్వహించారు.

ప్యాపిలి: మండల ప్రజలు ఆదివారం దీపావళి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.మండల పరిధిలోని సీతమ్మతండా, అలేబాదుతండా, లక్ష్మీతండాల్లో తండా వాసులు సేవాలాల్, మారెమ్మ తదితర దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బేతంచెర్ల: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, నాయకులు గూని నాగేశ్వరావు, ఎద్దులన్న మిఠాయిలు పంచి పెట్టి టపాసులు పెల్చి సంబరాలు జరుపుకున్నారు.

పుస్తక పఠనంతో ఒత్తిడి దూరం


గ్రంథాలయ వారోత్సవాల ఫ్లెక్సీ, పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్ : పుస్తక పఠనంతో మానసిక ఒత్తిడి దూరమవుతుందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే స్వగృహంలో బనగానపల్లె గ్రంథాలయ అధికారి బషీర్ అహమ్మద్ ఆధ్వర్యంలో 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే 56 జాతీయ గ్రంథాలయ వారోత్సవాలకు సంబంధించిన ఫ్లెక్సీ, పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పుస్తక పఠనం వల్లనే ఎంతో మంది మేధావులుగా ఎదిగారన్నారు. ప్రతి రోజూ పత్రికలు, పుస్తకాలు చదవడం వల్ల ఒత్తిడి దూరమవుంతుదని, అలాగే ప్రతి రోజు ప్రపంచ వ్యాప్తంగా జరుగు సంఘటనలు తెలుసుకునే అవకాశం ఉందన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు బాలల దినోత్సవం

వారోత్సవాల్లో భాగంగా మంగళ వారం బాలల దినోత్సవం (నేహ్రూ జయంతి), 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన నాయకులను స్మరించు కోవడం, 17న స్వాతంత్ర పోరాటంపై ప్రసంగాలు, 18న విద్యార్థులకు వ్యాస రచన, వకృత్వం, చిత్రలేఖనం, క్విజ్ పోటీల నిర్వహణ, 19న మహిళా దినోత్సవం, 20న అక్షరాస్యతా దినోత్సవాలు ఉంటాయని గ్రంథాలయ అధికారి బషీర్ అహమ్మద్ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, రామరావు, రామసుబ్బయ్యగౌడ్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో ఎమ్మెల్యే ఫాతెహాలు

పట్టణంలోని పోలీసు సర్కిల్ కార్యాలయ సమీపంలో ఉన్న కబీర్ అహమ్మద్ దర్గాను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సోమవారం దర్శించుకొని ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ గ్యార్మీ పండుగ పురస్కరించుకొని శ్రీ కబీర్ అహమ్మద్ దర్గాలో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు చేయడం సంతోషించతగినదన్నారు. కార్యక్రమం వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్ అంజాద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.


కబీర్‌అహమ్మద్ దర్గాలో ఫాతెహాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

అవుకు మండలం రామాపురం గ్రామ నూతన సర్పంచ్‌గా ఎన్నికైన బందెల రాము సోమవారం ఎమ్మెల్యేను ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువా, పూలమాలవేసి ఘనంగా సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో అందరూ కలిసికట్టుగా ఉంటూ గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రామాపురం వైఎస్సార్‌సీపీ నాయకులు రామసుబ్బారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రామారావు, రామచంద్రుడు, సీతయ్య, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ రజతోత్సవ వేడులకు ఆహ్వానం

బనగానపల్లె పట్టణంలోని అవుకు రోడ్డులో ఉన్న శ్రీ షిర్డీ సాయిబాబా మందిరం నిర్మించి 25 వసంతలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 19న నిర్వహించే రజతోత్సవ వేడుకలకు సంబంధించి ఆహ్వాన పత్రిక దేవస్థానం అధ్యక్షుడు శ్రీ రామవెంకట సుబ్రమణ్య, కమిటీ సభ్యులు సోమవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి ఆయన స్వగృహంలో అందజేశారు. ఎమ్మెల్యేను సన్మానించి వేడుకలకు రావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో షిర్డీ సాయిబాబా సేవా సమితి సెక్రటరి మధుసూదన్‌రెడ్డి, జాయింట్ సెక్రటరి ఇటిక్యాల నాగప్రసాద్, లక్ష్మీకాంత్‌గౌడ్, ఎస్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– అవుకు ఆర్అండ్‌బీ రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. 108 అంబులెన్స్ సిబ్బంది అందించిన సమాచారం మేరకు.. కోవెలకుంట్లకు చెందిన సుంకన్న, గంగమ్మ అనే వ్యక్తులు ఆటోలో ముదిగేడువైపు వెళుతూ ముందుగా వెళుతున్న ఎద్దుల బండిని ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం చేరవేయగా క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. సుంకన్న పరిస్థితి విషమం కావడంతో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు.

బహిరంగ సభను విజయవంతం చేయండి

బేతంచెర్ల : సీపీఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర ముగింపు సందర్భంగా ఈనెల 15న విజయవాడలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని లారీ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, సీపీఎం సీనియర్ నాయకులు ఎల్లయ్య, సాధిక్ హుసేన్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో పట్టణ కార్యదర్శి సంజీవ నాయుడు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.

15న వాహనాల వేలం

కొలిమిగుండ్ల: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలకు ఈనెల 15న వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌రెడ్డి సోమవారం తెలిపారు. హోండా షైన్, బజాజ్ పల్సర్, ప్లాటినా, లగేజీ ఆటోతో పాటు మొత్తం ఆరు వాహనాలు ఉన్నాయన్నారు. ఉదయం 10 గంటలకు పోలీస్ స్టేషన్ ఆవరణలో జరిగే వేలం పాటలో ఆసక్తి గల వారు రూ.5వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనవచ్చన్నారు. వాహనాలను దక్కించుకున్న వారు రోడ్ వర్తీ వాహనాలకు 12శాతం, స్క్రాప్ వాహనాలకు 18 శాతం అదనంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు.

కులసమస్యను రాజకీయం చేయడం తగదు


మాట్లాడుతున్న నాగేశ్వరరావు

కొలిమిగుండ్ల: కులసమస్యను పెద్దగా చిత్రీకరించి రాజకీయంగా లబ్ధిపొందాలనుకోవడం మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధనరెడ్డికి తగదని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు ఇరికిమాను నాగేశ్వరరావు అన్నారు. సోమవారం కొలిమిగుండ్లలోని ఎమ్మార్పీఎస్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మంద విజయ్‌గోపాల్ ఎమ్మార్పీఎస్ భవన నిర్మాణ పనులు ప్రారంభించినప్పటి నుంచి సోషల్ మీడియా ద్వారా వ్యక్తిగతంగా తమ కుటుంబ సభ్యులను, మహిళలను కించపర్చేలా పోస్టింగ్‌లు పెడుతున్నారన్నారు. ఇటీవల మహిళలపై అనంతపురంలో కేసు పెట్టాడన్నారు. విషయంపై మహిళలు ప్రశ్నించేందుకు వెళితే అసభ్యకరంగా ప్రవర్తించి, దుర్భాషలాడటంతో వారు ప్రతిఘటించారన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా మాజీ ఎమ్మెల్యే బీసీ ఎస్సీల మధ్య జరుగుతున్న సమస్యను రాజకీయ రంగు అద్దడం సమంజసం కాదన్నారు. మహిళలను వేధిస్తున్న వ్యక్తిని అడ్డుపెట్టుకొని మమ్మల్ని వైఎస్సార్‌సీపీ నాయకులుగా చిత్రీకరించడం మంచి పద్ధతి కాదని హితవుపలికారు. 30 ఏళ్లుగా ఎమ్మార్పీఎస్‌లో మంద కృష్ణ నాయకత్వంలో ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్నామని చెప్పారు. నాయకులు పుల్లయ్య, పెద్ద దస్తగిరి, రామాంజనేయులు, బాల ఓబులేసు, మారెన్న, చిన్న ఫక్కీర తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మద్దిలేటయ్యలో కార్తీక మాసోత్సవాలు

బేతంచెర్ల : మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీమద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో మంగళవారం నుంచి కార్తీక మాసోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు సోమవారం తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా ప్రతి రోజూ స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్తీక మాసంలో శనివారం తరలి వచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకొని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

డోన్‌కు చేరిన జ్ఞానజ్యోతి

డోన్ టౌన్ : ప్రముఖ ఆధ్యాత్మిక గురువు పిరమిడ్ కేంద్రం వ్యవస్థాపకులు బ్రహ్మర్షి పత్రీజీ ధ్యాన మహోత్సవాల్లో భాగంగా చేపట్టిన జ్ఞాన జ్యోతి ఆదివారం డోన్ పట్టణంలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా డోన్ పిరమిడ్ ధ్యాన కేంద్రం సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికి పట్టణ పురవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు.